

ఆంధ్రజ్యోతి
5
మంచిర్యాల
జిల్లా వార్తలు
ఆదివారం 21 సెప్టెంబరు 2025





హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మహా బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు చుంచు రాజ్‌కిరణ్ తెలిపారు. శనివారం మంచిర్యాలలో బతుకమ్మ సంబరాల పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 24న మంచిర్యాలలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాల మైదానంలో బతుకమ్మ సంబరాలను నిర్వ హిస్తున్నామన్నారు. ఆసక్తి గల మహిళలు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే సద్దుల బతుకమ్మను ఈనెల 29న నిర్వహించుకోవాలని పురోహితులు పేర్కొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్య దర్శి రవీందర్, కోశాధికారి కృష్ణ, ఉపాధ్యక్షులు హరికృష్ణ, తిరుపతి, సుధీర్ పురోహి తులు విశ్వేశ్వరశర్మ, నరహరిశర్మ, నాయకులు సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : నేరస్థులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రామ గుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం కమిషనరేట్ కా ర్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో పని చేస్తున్న కోర్టు డ్యూటీ అధికా రులకు, లైజనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్థులకు శిక్షపడేలా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమేష్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, లీగల్ సెల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఐటీసెల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, కోర్టుడ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

భీమారానికి చెందిన మూగ, చెవిటి బాలికను అత్యాచారం చేసిన పోక్సో కేసులో దోషికి శిక్షపడేందుకు కృషిచేసిన అనువాదకుడు యేసేపును శనివారం సీపీ అభినం దించారు. బాధితురాలు తెలియపరిచిన వివరాలను అనువాదంచేసి కోర్టులో వివరించారని, ఈ కేసులో దోషికి న్యాయమూర్తి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.12500 జరిమానా విధిం చారని, బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇస్తూ తీర్పునిచ్చారన్నారు. కేసులో కీలక పాత్ర పోషించిన యేసేపును సీపీ సన్మానించారు.

- ముందుకురాని కార్పొరేట్ ఆసుపత్రులు
- జిల్లాలో మూడింటికే అనుమతులు
- పేద, మధ్యతరగతి వర్గాల వారికి తప్పని ఇక్కట్లు

ఆరోగ్యశ్రీ సేవలు అంతంతే..!



మంచిర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధునాతన ఉచిత సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఇందు కోసం తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య శ్రీ కార్డులు కూడా అందజేశారు. ఆ కార్డుల ద్వారా ఎంపిక ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్సలు అందిస్తుండగా, బిల్లులకు సరిపడా నగదును ప్రభుత్వం ఆయా ఆసుపత్రుల నిర్వాహకులకు బ్యాంకుల్లో జమ చేస్తుంటుంది.

జిల్లా విషయానికి వస్తే ఆరోగ్య శ్రీ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లు కనీసం 50వరకు ఉన్నాయి. అయితే అందులో కేవలం మూడింటికి మాత్ర మే ఆరోగ్య శ్రీ అనుమతులు ఉండటం గమనార్హం. అనుమతులు వాటిలో కూడా అరకొరగానే ఆరోగ్య శ్రీ సేవలు అందు తున్నట్లు రోగులు చెబుతున్నారు.

ముందుకు రాని యాజమాన్యాలు...

జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ప్రైవేటు ఆసుపత్రులు 200 పై చిలుకు ఉన్నాయి. వాటిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేవి పదుల సంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల పేరిట పెద్ద సంఖ్యలో బోర్డులు దర్శనమిస్తాయి. అయినా ఆరోగ్య శ్రీ సేవలు అందించేందుకు వాటి నిర్వాహకులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వలక్ష్యం నీరుగారి పోతుండగా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్య సేవలు అందడం లేదు.

దీంతో ఆయా వర్గాల ప్రజలు వైద్యంకోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తుండగా, ఆర్థికంగా కొంత మెరుగ్గా ఉన్న కుటుంబాలు బిల్లులకు వెను కాడకుండా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళుతున్నారు. కనీసం 50 పడకలు ఉన్న ప్రతీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి ఆరోగ్య శ్రీ పథకం అనుమతులు పొందేందుకు అర్హత ఉంటుంది. అయితే ఆరోగ్య శ్రీ అనుమతులు పొంది లబ్ధిదారులకు చికిత్స అందిస్తే ప్రభుత్వపరంగా బిల్లులు ఎప్పుడు అందుతా యో తెలియని పరిస్థితులు ఉండటంతో నిర్వాహకులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పెండింగ్ బిల్లుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు యాజమాన్యాలు ప్రకటించాయి. ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో ఆ నిర్ణయాన్ని...

- మిగతా 7లో

క్షయ వ్యాధి నివారణ దిశగా ప్రభుత్వం చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో బ్రౌస్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో టీబీ వ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సంస్థ సహకారంతో వ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. బ్రౌస్ స్వచ్ఛంద సంస్థ వారు 350 పోషకాహార కిట్‌లను అందించడం అభినందనీయమన్నారు. జిల్లాలో 797 పాజిటివ్ కేసులు ఉన్నాయని, వ్యాధి గ్రస్తుల వివరాలను నిక్షయ మిత్ర పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతర 10 మందికి పోషకాహార కిట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అనిత, ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్, బ్రౌస్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్, టీబీ సమన్వయకర్త సురేందర్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జైపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇందారం గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు, దుకాణదారులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటేనే అనారోగ్యాల బారిన పడరని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో కాంపౌండ్‌వాల్, కిచెన్ షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల వేధింపులు ఆపాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కాపరులపై అటవీ శాఖ అధికారులు వేధింపులు, దాడులు ఆ పేలా చూడాలని కోరుతూ మంత్రి వివేక్‌వెంకటస్వామికి శనివారం హైద్రాబాద్‌లో కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు గుంట శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ నాయకులు మంద తిరుమల్‌రెడ్డి వినతి పత్రం అందించారు. గత కొన్ని రోజులుగా గొర్రెలు, మేకరుల కాపరులను అడవిలోకి మేత కోసం వెళితే అటవీ అధికారులు దాడులు చేస్తున్నారని తెలిపారు. ఈ దాడులను ఆపేలా చూడాలని కోరారు. దనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు.

అన్ని దానాలకంటే రక్త దానం గొప్పది

డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

లక్షెట్టిపేట, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాలకంటే రక్తదానం గొప్పదని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. శనివారం లక్షెట్టిపేటలోని ఎస్‌పీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు 66వ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ఎంతో మంది రక్తం అందక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. పార్టీ శ్రేణులు చేస్తున్న ఈకార్యక్రమాన్ని అభినందించారు. సుమారు 300 మంది స్వచ్ఛందంగా వచ్చి రక్త దానం చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. అనంతరం యువకులకు ప్రశంసాపత్రాలను అంద జేశారు. ఈకార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, ఆర్టీపీ ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, మాజీ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, అధికార ప్రతినిధి పూర్ణచందర్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి.ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, ఆర్టీఏ మెంబర్ శ్రీనివాస్, దండేపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్, రాజు, మోహన్, సుధాకర్, వెంక టేష్, బొప్పు సుమన్ పాల్గొన్నారు.


రక్తదానం చేసిన చైర్మన్ తిరుపతికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

టింబర్ డిపో సీజ్

భీమారం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని టింబర్ డిపోను మంచిర్యాల అటవీ రేంజ్ అధికారి రత్నాకర్, డిప్యూటి రేంజ్ అధికారి సుధాకర్‌లు శనివారం సీజ్ చేశారు. కొన్ని రోజుల నుంచి భీమారం ఫారెస్టులో టేకు చెట్ల కలప దుంగలను స్మగ్లర్లు దొంగలించారు. ఈ క్రమంలో నల్లాల రాజలింగుకు చెందిన వర్క్ షాప్ మండల కేంద్రంలోని చౌదరి వాడలో ఉండడంతో శుక్రవారం తనిఖీ చేయగా కలప లభ్యమైనట్లు తెలిపారు. లభ్యమైన కలపను ట్రాక్టర్ల ద్వారా కలప డిపోకు తరలిం చామని, వర్కుషాప్‌ను సీజ్ చేశామని తెలిపారు. విచారణలో పలువురు చెట్లు నరికి కలప స్మగ్లింగ్ చేశారని, ఆ కలపను నల్లాల రాజలింగుకు చెందిన టింబర్ డిపోలో విక్రయించినట్లు తెలిపారు. దీంతో వర్కుషాప్, టింబర్ డిపో రెండింటిని సీజ్‌చేశామని వెల్లడించారు.







మహిళల కోసం ప్రత్యేక చట్టాలు

హాజీపూర్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టాలను ఏర్పాటు చేసిందని జూనియర్ సివిల్‌జడ్జీ సాయి కిరణ్ అన్నారు. శనివారం మండలంలోని ముల్కల్ల ప్రభనర్సింగ్ కళాశాలలో లక్షెట్టిపేట మున్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరై మహిళహక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం మహిళల హక్కులకు బలమైన పునాదిని అందిస్తుందని సమానత్వాన్ని, వివక్షత లేకుండా అన్నిరంగాల్లో రక్షణ కల్పిస్తుందన్నారు. మహిళలపై లైంగికదాడులు, వరకట్న వేదింపులు జరుగుతే నిందితులకు చట్టం కఠినమైనశిక్ష విధిస్తుంద న్నారు. మహిళల భద్రత కోసం షీటీం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని, ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే షీటీంలకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని ఉన్నత హోదాలో ఉండాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ప్రతిఒక్కరు మంచి చదువులు చదువుకో వాలని తెలిపారు. అనంతరం మహిళహక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మిరెడ్డి సత్తన్న, న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్

పుష్ప విలాసం..

● నేడు ఎంగిలి పూల బతుకమ్మ ● తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్న పండుగ



ఆసిఫాబాద్‌రూరల్/బెజ్జూరు/నస్పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తీరొక్క రంగలు, వేర్వేరు రకాలు, వాటన్నింటా సుగంధమే.. ఇది బతుకమ్మపండుగ విశిష్టత. తెలంగాణసంస్కృతి విభిన్నమైనది. భాష, యాస, ఆచా రవ్యవహారాలు ఇతరులకు పూర్తిగా భిన్నం. చెట్టు, పుట్ట, రాయి, పూలను దైవాలుగా భావించి కొలిచే సం స్కృతి ఇక్కడే కనిపిస్తుంది. ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. అలాగే తమతో పాటు ఇతరులు చల్లంగా ఉండాలనే భావించే మంచి మనస్తత్వం తెలంగాణ ప్రజల జీవన విధానంలోని ఓ ప్రత్యేకత బతుకు బతి కించు అన్నదే ఇక్కడి జీవనవేదం. ఈ క్రమంలో సృష్టిలో భూమ్మీద మట్టి నుంచి వచ్చిన ఎన్నెన్నో పూలు అలా ఎన్ని పూలు పూసినా అన్నీ పరమాత్ముడి కోసమే అన్నట్లు అడపడుచులు బతుకమ్మలను పేర్చు కొని ఆ జగన్మాత కోసం, పరమేశ్వరుడి ప్రీతి కోసం బయలుదేరడమే బతుకమ్మ పండుగ విశిష్టత. ఆదివారం నుంచి ఎంగిలి పూల బతుకమ్మతో పండుగ ప్రారంభంకానుంది.

● ఆశ్వయుజ శుద్ధపాడ్యమికి ముందు..

ఆశ్వయుజ శుద్ధపాడ్యమికి ముందు వచ్చే అమా వాస్యను పెత్రమాస అంటారు. బతుకమ్మ పండుగ పేత్ర మాస నాడు ప్రారంభమై మహర్నవమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. మొదటిరోజున ఎంగిలి పూల బతురమ్మగా తొమ్మిదో రుజు సద్దుల బతుకమ్మగా జరుపుకుంటారు. బతుకమ్మను పేర్చుకోవడా నికి ముందు రోజే గ్రామం వెలుపల చేన్లు, చెలకలలో పెరిగిన తంగేడు, సీతజడ, తదితర పూలను సేక రించి ఇంటికి తెచ్చుకుంటారు. తెచ్చుకున్న వారి ఇంటిలో ఈ పూలు ఒకరోజు నిద్రచేస్తాయి. ఆ విధంగా నిద్రచేసిన పూలతో బతుకమ్మ పేర్చడం వల్ల ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు. అంతే కాకుం డా ముందురోజు మొగ్గలుగా ఉన్న పూలు తెచ్చుకొని బతు కమ్మ పేర్చుతు న్నపుడు నోటితో పూలను ఊది పేరు స్తారు. ఆ విధంగా పూలను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. రంగురంగుల పూలతో త్రికోణాకా రంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుదూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. తెలంగాణలో బతుకమ్మను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు.

● ఏ రోజు ఏ బతుకమ్మ అంటే..

ఈ నెల 21తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, 22న రెండోరోజు అటుకుల బతుకమ్మ, 23న మూడవ రోజు ముద్ద పప్పు బతుకమ్మ, 24న నాలుగవ రోజు నాన బియ్యం బతుకమ్మ, 25న ఐదవ రోజు అట్ల బతుకమ్మ, 26న ఆరవరోజు అలిగిన బతుకమ్మ, 27న ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, 28నఎనిమిదవ రోజు వెన్నముద్ద బతుకమ్మ, 29న తొమ్మిదవరోజు సద్దుల బతుకమమ్మ ఇలా రోజుకో పేరుతో అమ్మవారిని కొలు స్తారు. ఆ రోజున అలిగిన బతుకమ్మకు నివేధన ఉండదు. మిగిలిన రోజుల్లో రకరకాల ప్రసాదాలను గౌరమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.



ఉత్సాహంగా బతుకమ్మ పండుగ..



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ అడపడుచులు బతుకమ్మ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ పండుగతో తెలం గాణ సంస్కృతి మూలాలు తెలుసుకునే గొప్ప అవకాశం ఉంటుంది. ఇలాంటి సాంస్కృతిక పునర్జీవం నేటి సమాజానికి ఎంతో అవసరం.

- అరుణబాయి, ఏవో, ఆసిఫాబాద్

భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు..



తెలంగాణ ప్రాంతంలో ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ప్రత్యేక పండుగ బతుకమ్మ. పండుగ ప్రారంభమవుతుందంటే ఆడబిడ్డలు పుట్టింటికి వస్తారు. దీంతో ఇళ్ల కళకళలాడుతాయి. ఒకరి సద్దులు మరొకరు తీసుకోడం సంతోషం కలిగించే అంశం.

- శకుంతల, జీసీడీవో, ఆసిఫాబాద్

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

దహెగాం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సమపాలలో తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషక మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భివణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా తీసుకోవాలన్నారు. పాలు, పండు, కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హెచ్‌ఎం శారద, ఏడబ్ల్యూటీలు పార్వతి, పద్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వాంకిడి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం స్వాస్థనారి శ సక్త పరివార్ అభియాన్ పేరిట నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి రియాజ్ తెలిపారు. శిబరంలో 65 మందికి ఎస్‌సీడీ స్ర్కీనింగ్, 5 మందికి ఏఎన్‌సీ పరీక్షలు, ఐదుగురికి దంత పరీక్షలు, 50 మందికి ఇమ్యూనైజేషన్ పరీక్షలు, 15 మందికి టీబీ పరీక్షలు, నలుగురు మహిళలకు హైజీన్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ వినయ్ ఉప్రె, డాక్టర్ రియాజ్, డాక్టర్ అయేషా, డాక్టర్ స్రవంతి, పీఎంజేఏఎన్‌ఎంఎఫ్వై బృందం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కష్టాలు



బెజ్జూరులో క్యూలైన్‌లో వేచి ఉన్న మహిళా రైతులు

బెజ్జూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు యూరియా కష్టాలు తీరడం లేదు. అదను దాటుతున్నా యూరియా బస్తాలు అందక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శనివారం బెజ్జూరు మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌కు యూరియా బస్తాలు రావడంతో వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున ఉదయం నుంచి క్యూలైన్లలో బారులు తీరారు. ఒక్కో రైతుకు కేవలం ఒకటి రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో ఇది ఏ మాత్రం సరిపోవని ఆగ్రహం వ్యం చేశారు. యూరియా పంపిణీ కేంద్రం వద్ద ఎస్సై సర్దాజ్ పాషా ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ షామియానాలు, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): యూరియా బస్తా కోసం రైతులకు కష్టాలు తప్పడం లేదు. అదను దాటి పోతున్నా వర్షాలు కురిస్తే ఎరువులు వేసుకోవచ్చని రైతులు యూరియా కోసం బారులు తీరారు. రైతులకు ఒకటి లేదా రెండు చొప్పున బస్తాలు ఇవ్వడంతో ఆవేదన చెందుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా యూరియా బస్తాల కోసం తిరుగుతున్నామని వాపోతున్నారు. శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 888, బీబ్రా ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 333, గిరివెల్లి రైతు వేదిక వద్ద 88 యూ రియా పంపిణీ చేశామని ఏవో రామకృష్ణ తెలిపారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద ఎస్సై విక్రమ్ బందో బస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీవో బక్కయ్య, ఏఈవోలు వంశీ, లావణ్య, రోహిణి, ఆనంద్‌రావు, సాయి, జీవన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతమే ధ్యేయం



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థ బలోపేతమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణి అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు, సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పూర్వ ప్రాథమిక పాఠశాలల నియామకాలు, ప్రొక్యూర్‌మెంట్ కమిటీ ఏర్పాటు, ఎఫ్‌ఎల్‌ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌లు, ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో నాటిన మొక్కల వివరాలు ఇతర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీలో జిల్లాల వారీగా ప్రగతి, జిల్లా పరిషత్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఖాన్ అకాడమి, ఫిజిక్స్ వాలా తరగతులు లైబ్రరీల నిర్వహణ, ఏర్పాటు, బ్యాడ్ యాక్టివిటీస్, డ్రాప్ బాక్స్ క్లియరెన్స్, యూడైస్, అపార్ స్థాయి, ప్రధాన మంత్రి పోషన్, పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్స్ ఇతర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం నుంచి అదనపు కలెక్టర్, ఇన్ చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రభుత్వం చేట్టిన పాఠశాలల అభివృద్ధి, ఆర్టిఫి షియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్ ఇతర కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ అధి కారుల సమన్వయంతో ప్రతి పాఠశాలలో అమలు చేసే విధంగా చర్యలు తీసుంటున్నామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను నిరంతరం సందర్శించి పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పర్యవేక్షించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, అబిద్ ఏత, మదుకర్, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

లక్షెట్టిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దవపెల్లి వెంకటేష్(29) అనే యువకుడు అనారోగ్యం కారణంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపతి సురేష్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వెంకటేష్ ఆరు నెలల నుంచి పచ్చకామెర్ల వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించి మందులు వాడినా రోగం నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్ తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై-2 రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణపూర్‌లో దారుణం

భార్యను హత్య చేసిన భర్త



స్రవంతి(ఫైల్)

రెబ్బెన, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం నారాయణపూర్ రోజు మద్యం తాగి వస్తున్నామని నిలదీసిన భార్యను శనివారం ఉదయం భర్త గొడ్డలితో దాడి చేసి హత్య చేశా డు. రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్ గ్రామానికి చెందిన గజ్జల స్రవంతి (40) గజ్జల తిరుపతి(45) భార్య భర్తలు. తిరుపతి రోజు మద్యం తాగి వస్తుండడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. భార్య తనను రోజు మద్యం తాగుతున్నావని నిలదీస్తోందని ఆగ్రహంతో ఉన్న తిరుపతి శనివారం ఉదయం ఇంటి ముందు పని చేసుకుంటున్న స్రవంతిపై వెనుక నుంచి గొడ్డలితో దాడికి పాల్ప డ్డాడు. తీవ్ర గాయా లతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురికి వివాహమైంది. కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. స్రవంతి సోదరుడు సంజయ్‌వరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. తిరుపతిని అదుపులోకి తీసుకు న్నామని తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సంజయ్ సంద ర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కోటపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సా, ఆలుగామ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 23 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 1900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు


నెన్నెల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భార్యపై దాడి చేసి చంపుతానని బెదిరించిన జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబర్‌పేటకు చెందిన బిటుకు కిష్టయ్యపై నెన్నెల పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కిష్టయ్యతో నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన నళినితో 2010లో వివాహం జరిగింది. ఉపాధికోసం దుబాయ్ వెళ్లిన కిష్టయ్య ఇటీవలే తిరిగి వచ్చాడు. భార్యపై అనుమానంతో రోజుకొట్టేవాడు. భయంతో నళిని స్వగ్రామం చిత్తాపూర్‌కు తిరిగి వచ్చింది. రెండు రోజుల కిందట ఇక్కడికి వచ్చిన కిష్టయ్య భార్య నళిని కొట్టడంతో పాటు చంపుతానని బెదిరించాడు. ఆమె కుటుంబ సభ్యులను తిట్టాడు. భర్తతో తనకు ప్రాణహాని ఉందని నళిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

యువతిపై లైంగిక దాడికి యత్నం

భీమిని, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువతిపై లైగిక దాడి చేసినందునకు యువకుడిపై శనివారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమొదు చేసినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని అక్కలపెల్లి గ్రామానికి చెందిన ఆరె సురేష్ అనే యువకుడు ఈనెల 17న ఉదయం గ్రామ షివారులో కాలకృ త్యాలకు వెళ్తున అదే గ్రామానికి చెందిన యువతిపై లైగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో యువతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బురదలో జారిపడి గీత కార్మికుడి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలగురిజాల గ్రామానికి చెందిన పోతుగంటి శంకర్(65) శనివారం బురద లో జారిపడి మృతి చెందినట్లు తాళ్లగురిజా ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. గ్రామ శివారులో ఈతచెట్టుకు కల్లు తీయడానికి శంకర్ వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పొలంగ ట్టు నుంచి వెళుతుండగా ప్రమాదవశాత్తు బుదరలో జారిపడ్డాడు. దీంతో మొఖం బురదలో కూరకుపోయి శ్వాస ఆడక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. శంకర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా కోరారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా స్థాయి స్ట్రక్చర్ సమావేశంలో నిర్వహించారు. ఏరియా స్థాయిలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ రమణారావు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవి కుమార్, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్ కుమార్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కొట్టె కిషన్‌రావు, బద్రి బుచ్చయ్య, అడ్డు శ్రీనివాస్, తంగళ్లపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రెబ్బెన, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్‌ఓటు జీఎం రాజమల్లు అన్నారు. సింగరేణి స్కూల్ గ్రౌండ్ ఆవరణలో శనివారం నిర్వహించిన డిపార్టుమెంటు కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు క్రీడాకారుల్లో ధైర్యం, చురుకుదనం, సమన్వయం పెంపొందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి డి ప్రశాంత్, గుర్తింపు సంఘం నాయకులు జూపాక రాజేష్, కోఆర్డినేటర్ అన్వేష్, జనరల్ కెప్టెన్ కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

23న దసరా అడ్వాన్స్ చెల్లింపు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా కార్మికులకు ఏటా అందించే రూ. 25 వేలు మంగళవారం చెల్లించేందుకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పర్మనెంట్ ఉద్యోగుల ఖాతాల్లో ఈ మొత్తాన్ని ఈ నెల 23వ తేదీన జమ చేయనున్నారు. ఏడాదిలో 190 మస్టర్లు పూర్తి చేయని బదిలీ వర్కర్ కార్మికులకు రూ.12 వేల 500లు ఇవ్వనున్నారు.

సింగరేణి ఉద్యోగులకు

లాభాల వాటా చెల్లించాలి



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్/శ్రీరాంపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబం ,ధించి లాభాల వాటా 35 శాతం ప్రకటించి వెంటనే చెల్లించాలని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హైదరాబాద్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావుతో కలిసి గుర్తింపు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భం గా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడ సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం గడిచిపోయి ఆరు నెలలు కావస్తుందని అన్నారు. లాభాల వాటా కోసం సింగరేణి ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని లాభాల వాటా ప్రకటించే విధంగా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు సొంతింటి పథకం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మెడికల్ బోర్డుకు ఆదేశాలు ఇవ్వాలని, మారుపేర్లకు సంబంధించి సమస్య పరిష్కరించాలని, పెరిక్స్‌పై ఇన్‌కంట్యాక్స్ యాజమాన్యం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన గనుల ఏర్పాటుకు కృషి చేయాలని, కోయగూడెం 3, సత్తుపల్లి 2, తాడిచెర్ల 2 బ్లాక్‌లు సింగరేణికి వచ్చేలా చూడాని చెప్పారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని, రెండు రోజుల్లో లాభాల వాటా ప్రకటించే అవకాశాలున్నాయని నాయకులు తెలిపారు.

పరిశీలించి.. సూచనలు చేసి..

రెబ్బెన, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాను శనివారం ఓఎస్‌డీ జనరల్ మేనేజర్ డీవీ సుబ్రమణ్యం (కొత్తగూడెం) సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. బెల్లంపల్లి ఏరియాలో మూతబడిన గనులు, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ పనులపై జీఎం విజయ భాస్కర్ రెడ్డితో చర్చించారు. బొగ్గు నాణ్యత, బొగ్గు సరఫరాపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కైరిగూడ ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఎస్‌ఓటు జీఎం ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, ఇంజనీర్ కృష్ణమూర్తి, డీజీఎం సివిల్ బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవి పాల్గొన్నారు.

వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. ఆర్‌కే న్యూటెక్ గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దసరా పండుగ ఇంకా 12 రోజులే మిగిలి ఉన్నా లాభాలపై ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. దశలవారీ పోరాటంలో భాగంగా తమ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించామని పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో లాభాలపై ప్రకటన రాకపోతే అన్ని జీఎం కార్యాలయాల ఎదుట బతుకమ్మలతో నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చడం లేదన్నారు. అంతేకాకుండా లాభాల వాటాపై ప్రకటన ఇప్పించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఈ నెల 22న జరిగి పీఎల్‌ఆర్ బోనస్ చర్చల్లో లక్ష 25 వేల రూపాయలు ఇప్పించి ఆయా యూనియన్లు తమ చిత్తశుద్ధిని చూపించాలని డిమాండ్ చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు పానుగంటి సత్తయ్య, పెట్టం లక్ష్మణ్, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, ఎండి లాలా, సాదుల భాస్కర్, వెంగళ కుమారస్వామి, పిట్ కార్యదర్శి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

కెరమెరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి అన్నారు. శనివారం మండలంలోని తుమ్మగూడ గ్రామాన్ని సందర్శించి బదావత్ అంబులాల్ అనే రైతు సాగు చేస్తున్న పంట పొలాన్ని పరిశీలించారు. నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో పంపిణీ చేసిన కంది, పెసర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలు ఆశాజనకంగా ఉందన్నారు. పంటల స్వభావం, చీడపీడల నివారణ, వాతావరణ మార్పులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో యుగేందర్, ఉద్యా నవన అధికారి నదీమ్, ఏఈవో శ్వేత, రైతు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో శనివారం అమ్మాయిలను వేధిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు షీ టీం సభ్యులు స్వప్న, దినేష్, రజిని తెలిపారు. అమ్మాయిలను, మహిళలను, బాలికలు ఎవరైనా వేధింపులకు గురైన ట్లయితే ఆసిఫాబాద్ షీ టీం 8712670564 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబం బతుకమ్మ

సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య


మాట్లాడుతున్న సీవీ రామన్ కళాశాల ప్రిన్సిపాల్ గడిపెల్లి నర్సయ్య

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండగ ప్రతిబింబమని సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గడిపెల్లి నర్సయ్య పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను, ఫుడ్ ఫెస్టివల్ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి ఒక చోట పెట్టి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. తెలంగాణ వంటకాల ప్రదర్శన నిర్వహించి ఉత్తమ వంటలు చేసిన విద్యార్థులను సన్మానించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కేవీ ప్రతాప్, డైరెక్టర్ శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి పరిహారం


కార్మికుడి మృతదేహం వద్ద సత్యపాల్‌రావు

మంచిర్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ కంపెనీలో రేణిగుంట శంకర్ అనే కార్మికుడు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి రూ. 5.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వడానికి కంపెనీ యాజమాన్యం అంగీకరించినట్లు యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్‌రావు తెలిపారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం కార్మికుడి మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని, అంత్యక్రియల కోసం రూ. 50వేలు చెల్లించేందుకు కంపెనీ ముందుకు రావడంతోపాటు మృతుడి కుమారుడికి అర్హతల మేరకు ఉద్యోగం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు.

దేశ రాజకీయాలపై మోదీ ముద్ర

బెల్లంపల్లి, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాలపై పీఎం మోదీ తన దైన ముద్ర వేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని శంశీర్‌నగర్ పీహెచ్‌సీ ఆసుపత్రిలో పట్టణ అధ్యక్షురాలు దారా కళ్యాణి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ 75వ పుట్టిన రోజు వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. అనంతరం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల బుగ్గ శ్రీరాజరాజేశ్వర దేవాలయంలో ప్రధాని మోదీ పేరుమీద అభిషేకం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజి, మాజీ ఎమ్మెల్యే అము రాజుల శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వెంకటక్రిష్ణ, కార్యదర్శి రాచర్ల సంతోష్, కౌన్సిల్ సభ్యులు శ్రావణ్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

భీమిని, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని క్షయవ్యాధి సూపర్‌వైజర్ శశికాంత్ అన్నారు. శనివారం మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలోని ఆరోగ్యకేంద్రంలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే అనుమానించాలన్నారు. వ్యాధినిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స అందిస్తూ ప్రతినెలనెల రూ, 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే, పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ జలపతి, హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్, కార్యదర్శి సంతోష్, ఉమామహేందర్, ప్రవళిక, ఏఎన్‌ఎంలు మీనా, హేమలత, సంతోషమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ మల్లక్క, ఆశాకార్యకర్తలు రాజేశ్వరి, నిర్మల, రజిత, వసంత, అంగన్వాడీ టీచర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

దిగివస్తున్న సన్న బియ్యం



- నాలుగు నెలలుగా రేషన్ షాపుల ద్వారా సన్నబి య్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం
- బహిరంగ మార్కెట్‌లో తగ్గుతున్న ధరలు

బెల్లంపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు దిగి వస్తున్నాయి. ఇటీవల మూడు నెలల రేషన్ బియ్యం కోటా సన్న బియ్యం ఒకే సారి పంపిణీ చేయడంతో అందరి ఇళ్లలో బియ్యం నిల్వలు ఉన్నాయి. దీంతో పాటు సెప్టెంబరు నెల కోటా సన్నబియ్యం సైతం లబ్ధిదారులు అందరూ తీసుకోవడంతో బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు క్రమ క్రమంగా పడిపోతున్నాయి. కిరాణ దుకాణాల్లో రేషన్ డిపోల్లో, రైస్ మిల్లులో కొనేందుకు వినియోగదారులు రాకపోవడంతో వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు.

సన్న బియ్యం పంపిణీతో సంబరం..

జిల్లాలో 2.23లక్షల మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డు దారులకు 423 రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల 4173 టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. వీరందరికీ జూలై నుంచి సెప్టెంబరు వరకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి 12500 టన్నులు పంపిణీ చేశారు. ఇటీవల ప్రభుత్వం రేషన్‌కార్డు లేనివారిని దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో వేల మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో తాజాగా మరో 28,950 మందికికొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. వీరికి సైతం ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేసింది.

ధరల తగ్గుదలతో ఊరట..

ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో సన్న బియ్యం ధరలు దిగివస్తున్నాయి. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో ఎంతోమంది రేషన్‌కార్డు దారులు దొడ్డు బియ్యాన్ని విక్రయించి సన్న బియ్యం కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో సన్న బియ్యం కొనుగోలు చేయడం లేదు. కొందరు వ్యాపారస్తులు రైస్ డిపోలను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ఏడాది జైశ్రీరామ్(పాతవి) క్వింటాల్‌కు రూ.7500 ఉండగా ప్రస్తుతం రూ.7100 ఉన్నాయి. అ లాగే జైశ్రీరామ్ (కొత్తవి) గతేడాది రూ.7000, ప్రస్తుతం రూ.6400, హెచ్‌ఎంటీ (పాతవి) గతేడాది రూ. 6100, ప్రస్తుతం రూ. 5600, హెచ్‌ఎంటీ (కొత్తవి) గతేడాది 5600, ప్రస్తుతం రూ. 5000, బీపీటీ (పాతవి) గతేడాది రూ.5000, ప్రస్తుత రూ. 4300, బీపీటీ(కొత్తవి) గతేడాది రూ.4150, ప్రస్తుత ధర రూ. 3800గా ఉన్నాయి. రేషన్ షాపుల్లో సన్న బియ్యం సరఫరాతో జిల్లాలో గడిచిన రెండు నెలల వ్యవధిలో పదికిపైగా రైస్ డిపోలు మూతపడినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

రైస్ డిపోల్లో కొనడం లేదు..



ప్రభుత్వం నాలుగైదు నెలలుగా రేషన్‌దుకాణాల ద్వా రా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో కిరాణ షాపు ల్లో, రేషన్ డిపోల్లో సన్న బియ్యం కొనుగోలు చేయడం లేదు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో తప్పనిసరిగా ప్రతినెల సన్న బియ్యం కొనుగోలు చే యాల్సిన పరిస్థితి ఉండేది. ఇటీవల మూడు నెలల రేషన్ కోటా ఒకేసారి పంపిణీ చేయడంతో ఇంటిలో మరో రెండు నెలలకు సరిపడా బియ్యం నిల్వ ఉన్నాయి. ఏదేమైన మాలాంటి వారికి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో ఆర్థిక భారం పడడం లేదు.

- ప్రకాశ్, రేషన్‌కార్డు దారుడు బెల్లంపల్లి

సన్న బియ్యం అమ్మకాలు తగ్గాయి...



ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో సన్న బియ్యాల అమ్మకాలు చాలా వరకు తగ్గాయి. దీంతో ఎక్కువ మొత్తంలో సన్న బియ్యాన్ని దిగుమతులు చేసుకుంటలేము. పలు ప్రాంతాల్లో ఇప్పటికే హోల్‌సేల్ బియ్యం దుకాణాలు మూత పడ్డాయి. సన్నబియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తుండడం తో గతేడాదికంటే ఈ ఏడాది సన్న బియ్యం ధరలు తగ్గాయి.

- తిరుపతి, హోల్‌సేల్ బియ్యం వ్యాపారి

సంక్షిప్త సమాచారం

తాండూర్ : నాణ్యమైన రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాసిపేట, తాండూర్ గ్రామాల్లోని కేఎస్‌ఎం 1638 రకం వరి పంటను శనివారం ఆదిలాబాద్ కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. స్థానిక వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు రఘువీర్, శివచరణ్, సురేష్, రాకేష్, మండల వ్యవసాయాధికారి సుష్మ, ఏఈవోలు వెంకటేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

తాండూర్ :మండలంలోని తంగళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బీజేపీ 118 బూత్ అధ్యక్షుడు ఏముర్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధాని మోదీజన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, బీజేపీ నాయకులు దూడపాక భరత్, శేషగిరి, మల్లేష్, చిరంజీవి, విగ్నేష్, ప్రదీప్, అరుణ్ పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని పలువురు లబ్ధిదారులకు శనివారం మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ ఆలీ సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. 31 మంది లబ్ధిదారులకు రూ. 12 లక్షల విలువ గల చెక్కులను అందించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చే స్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాకులు ఆకుల లింగాగౌడ్, కుర్రు వెంకటేష్, ముల్కల్ల సత్యనారాయణ, ఒడిల రాజన్న, జహిద్ ఆలీ, శంకర్, మధు, జగన్, పున్నం, పూర్ణచందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : ఇందిరమ్మ ఇళ్ల నిరుపేదలకు వరమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్ పేర్కొన్నారు. శనివారం చిర్రకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ పూర్తయిన సందర్భంగా ఏఈ జ్యోత్స్న బిల్లు మంజూరు కోసం ప్రపోజల్ పంపడం జరిగిందని తెలిపారు. ఇళ్ల లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు అంతంతే..!

(5వ పేజీ తరువాయి)

వెనక్కి తీసుకున్నప్పటికీ, జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి తలెత్తలేదు. జిల్లా వ్యాప్తంగా కేవలం మూడు ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందుతుండటమే దీనికి ప్రధాన కారణం.

జిల్లా వ్యాప్తంగా 2 లక్షల కార్డులు...

జిల్లాలో 2 లక్షల పై చిలుకు ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్నాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే తెల్ల రేషన్ కార్డు దారులందరికీ ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్నట్లే లెక్క. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 19 వేల 162 మందికి తెల్ల రేషన్ కార్డులు ఉండగా, వారందరికీ అనుమతులు పొందిన ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు పొందేందుకు అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలోని మెడిలైఫ్, టచ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులతోపాటు అభయ్ కిడ్నీ సెంటర్‌లకు మాత్రమే ఇప్పటి వరకు ఆరోగ్య శ్రీ పథకం అనుమతులు ఉండగా, లబ్ధిదారులకు ఆ విభాగంలో వైద్య సేవలు అందుతున్నాయి. పై మూడు ఆసుపత్రుల్లో వాటి స్పెషాలిటీని బట్టి ప్రస్తుతం ఆర్థో, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగంలో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి.

వైద్య సేవలు విస్తృతం అయ్యేనా...?

వాస్తవంగా ఆరోగ్యశ్రీ పథకం కింద మొత్తం 1835 రకాల వ్యాధులకు చికిత్స అందాల్సి ఉంది. ఇందులో సాధారణ చికిత్స మొదలుకొని ఆపరేషన్ల వరకు సేవలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ముందుకు వచ్చి, ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తే, ఆ విభాగంలో వైద్య సేవలు మరింతగా విస్తృతం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆరోగ్య శ్రీ సేవల కోసం జిల్లా వాసులతోపాటు కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన లబ్ధిదారులు సైతం జిల్లా కేంద్రానికి వస్తుంటారు. కేవలం మూడు ఆసుపత్రుల్లో మాత్రమే సేవలు అందుబాటులో ఉండటంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సహా, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చొరవతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్వాహకులను ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించేలా కృషి చేయగలిగితే లబ్ధిదారులకు మరిన్ని ఉచిత వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

జీఎంను కలిసిన మున్సిపల్ కమిషనర్


జీఎంకు సన్మానిస్తున్న కమిషనర్ రాజలింగు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియా నూతన జీఎం రాధాకృష్ణను మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో జీఎంను సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీలోని సింగరేణి పరిధిలోని వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. త్వరలోనే వార్డుల్లో కలిసి పర్యటించి రోడ్లు, డ్రైనేజీల తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీటిపై జీఎం సానుకూలంగా స్పందించారని కమిషనర్ తెలిపారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో

జన్నారం, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా దొరకడం లేదని రైతులు శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు వేసి ఇన్ని రోజులు గడిచిన యూరియా వేయక పోవడంతో పంట చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. కష్టపడి నాట్లు వేసి యూరియా కోసం ఎదురు చూసి పడిగాపులు కాసినా ఒక్క బస్తా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు బీష్మించు కూర్చోవడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు చేరుకొని వారికి సర్దిచెప్పి పంపించేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని కిష్టంపేట గ్రామానికి శనివారం 310 యూరియా బస్తాలు వచ్చాయి. యూరియా బస్తాలను వ్యవసాయశాఖ అధికారులు ఒక్కో రైతుకు ఒక్కో యూరియా బస్తాను పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు, మహిళలు క్యూలైన్‌లలో గంటల తరబడి పడిగాపులు గాశారు.

కాటమయ్య కిట్‌లు అందించాలి

తాండూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇస్తామన్న కాటమయ్య కిట్‌లు అందకపోవడంతో గీత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండిగౌడ్ పేర్కొన్నారు. శనివారం తాండూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తుల జీవనం రోజు రోజుకు అధ్వానంగా మారుతుందన్నారు. శనివారం బెల్లంపల్లి మండలం మాల గురిజాల గ్రామంలో పోతుగంటి శంకర్‌గౌడ్ అనే గీత కార్మికుడు చెట్టు ఎక్కి కాలుజారి పడి మృతిచెందాడని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గీత కార్మికులకు వెంటనే కాటమయ్య కిట్‌లు అందించాలన్నారు. అలాగే మృతిచెందిన గీత కార్మికుడు శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ. 10 లక్షలు చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు శంకర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, రమేష్ గౌడ్, సృజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వృధా నీటితో మైదానం చిత్తడి

కాసిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట 1వ గని నుంచి వృధాగా పారుతున్న వరద నీటితో మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానం చిత్తడిగా మారింది. దీంతో ప్రతి రోజు ఉదయం మైదానంలో వాకింగ్ చేసే వాకర్లు, క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయం కాసిపేట గని మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి క్రీడా మైదానానికి మరమ్మతులు చేయకపోతే గనిని ముట్టడిస్తామని క్రీడాకారులు హెచ్చరించారు.

మహా చండీయాగం విజయవంతం చేయాలి

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాత మంచిర్యాల శ్రీ రామలింగేశ్వర ఆలయంలో ఈ నెల 27 శనివారం నిర్వహించే చండీహవన సహిత రుద్ర హోమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ తూముల వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు అష్టకాల రాజేష్, రాజేందర్ ఆధ్వర్యంలో అరుణ్‌శర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 108 జంటలతో హోమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఆలయం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. భక్తులు సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

లక్సెట్టిపేట, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బ్రౌప్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో శనివారం క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ చేతులమీదుగా అందజేసారు. సుమారు 10మంది క్షయవ్యాధి గ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు వ్యాధిగ్రస్తులకు గుర్తించి కిట్లను అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కోటేశ్వర్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్‌రావు, ప్రోగ్రామం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్‌నాయ్, డీపీసీ సురేందర్, టీబీ సూపర్‌వైజర్ సురేష్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలి

తాండూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. శనివారం తాండూర్ గ్రామపంచాయతీలో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించి ప్రతి రోజు రోడ్లు,మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. రోడ్లపై చెత్తా, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పీఎం ఆవాస్ సర్వేను వేదవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి దివాకర్ ఉన్నారు.

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు


మంచిర్యాలలో బతుకమ్మతో వివేకవర్ధిని విద్యార్థులు, సిబ్బంది



చెన్నూర్ మండలం కిష్టంపేట డిగ్రీ కాలేజీలో..

మంచిర్యాల క్రైం : మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సంజీవ్, డీన్ రవికుమార్, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాల వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కాలేజీలో విద్యార్థులు బతుకమ్మ ఆట పాటలతో కోలాటాలతో నృత్యాలు చేస్తూ అలరించారు. కరస్పాండెంట్ చంద్రమోహన్ గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సారా తస్నీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలోని శనివారం ముందస్తుగా బతుకమ్మ సంబురాలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో శనివారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు, మహిళ ఉపాధ్యాయునులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మలను ప్రతిష్టించి పాటలు పాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అందంగా ఉన్న బతుకమ్మలను గుర్తించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బతుకమ్మలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్, మహిళ ఉపాధ్యాయులు అనిత, అనూష, హరీష, ఆమని, గీత, సుష్మిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూరు : కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకురాలు పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.

తాండూర్ : మండలంలోని అచ్చలాపూర్ ప్రభుత్వ పాఠశాల, కస్తూర్బావిద్యాలయంలో శనివారం ముందస్తు బతుకమ్మ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాల్లు, విద్యార్థినులు పూలతో బతుకమ్మలను తయారు చేసి పెట్టి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది.

జైపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అమ్మఆదర్శ కమిటీ అధ్యక్షురాలు మద్దుల సునీతరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, గోపాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలో సద్దుల బతుకమ్మ పండుగను విద్యార్థులు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. కవ్వాల్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు ఘనంగా బతుకమ్మ నిర్వహించారు. కలమడుగులోని వివేకానంద పాఠశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాసని రమేశ్, చందర్, రమేశ్ చందర్, అనసూయ, రామస్వామి, మనోజ్, సతీష్‌లు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట : పట్టణంలోని రాఘవేంద్ర కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ విశిష్టతను పాఠశాల అకాడమిక్ అడ్మినిస్ట్రేటివ్ శిల్ప విద్యార్థులకు వివరించారు.

అనంతరం బతుకమ్మలను పట్టణంలోని గోదావరిలో నిమజ్జనం చేసారు. ప్రిన్సిపల్ అనీల్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ అశ్వినితోపాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





లక్సెట్టిపేట ఆర్‌కే పాఠశాలలో.. దండేపల్లి కస్తూర్బా విద్యాలయంలో..కోటపల్లి మోడల్ స్కూల్‌లో..జైపూర్‌లో బతుకమ్మలతో విద్యార్థినులు





తెగని 'పంచాయతీ'

- స్థానిక ఎన్నికలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఆందోళన
- జిల్లాలో 3,53,895 మంది ఓటర్లు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో... పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా.. కొత్త విధానం అవలంబిస్తారా.. ఇలా పల్లెల్లో ఎక్కడ చూసినా చర్చ సాగుతోంది. పంచాయతీ పదవుల పై కన్నేసిన ఆశావహులు ఓ వైపు రిజర్వేషన్ కలిసోస్తుందో లేదోనని ఆందోళన పడుతూనే వర్తించక పోతే ఏం చేయాలోనని ప్రస్తుతం తర్జన భర్జన పడుతున్నారు. కొందరు ఆసక్తిగల నేతలు తమ అనుచరగణంతో ఎన్నికలపై సమాలోచనలు జరుపుతున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు సైతం తమ హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రావాల్సి ఉన్నా... వచ్చే ఎన్నికల్లో తమ ఉనికి చాటు కునేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు.

గత ప్రభుత్వం..

బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమల్లో ఉండేలా గత ఎన్నికల సమయంలోనే చట్టం రూపొందించింది. ఆ చట్టం ప్రకారం పాత రిజర్వేషన్లనే కొనసాగించాల్సి ఉంటుంది. కానీ ఈసారి కాంగ్రెస్ అధికారం లోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని సర్కార్ కొత్త విధా నం అమలు చేసి తమ మార్కు చూపెట్టుకునేఅభిప్రాయాలున్నాయి. అదే జరిగితే పాత రిజర్వేషన్ల చట్టా న్ని రద్దు చేసి కొత్తది రూపొ ందిం చాల్సి ఉంటుంది. అందుకు ఏ పద్ధ తులను అమలు చేస్తారోననే ఉత్కం ఠ ఆశావహుల్లో నెలకొంది. రిజర్వే షన్ల అమలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత ఇ వ్వకపోవడం ఆందోళనకుగురి చేస్తోంది.

ఓటరు జాబితా తయారీ..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండేలా ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికార యంత్రాంగం ఓటరు తుది జాబితా తయారీ పూర్తి చేసింది. ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించు కునేలా చేశారు. ఫొటో ఓటరు జాబి తా ప్రచు రించింది. ఓటరు జాబితాపై అభిప్రాయ సేకరణ కోసం జిల్లా స్థాయి రాజకీయ నాయకుల తో సమావేశాలు నిర్వహించారు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లోని 2,874 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,53,895 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడిం చింది. ఇందులో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు ఉన్నారు,

మండలాల వారీగా పంచాయతీ ఓటర్లు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	15,039	15,276	0	30,315
బెజ్జూరు	11,685	12047	2	23,734
చింతలమానేపల్లి	12,118	11,837	0	23,955
దహెగాం	11,014	11,077	1	22,092
జైనూరు	11,936	12,427	0	24,363
కాగజ్‌నగర్	22,857	22,383	2	45,242
కెరమెరి	12,145	11,880	1	24,026
కౌటాల	13,796	13,560	1	27,357
లింగాపూర్	5,103	5,479	1	10,583
పెంచికలపేట	6,218	6,084	0	12,302
రెబ్బెన	14,523	14,201	0	28,724
సిర్పూర్(టి)	11,016	11,163	3	22,182
సిర్పూర్(యూ)	5,835	6,440	2	12,277
తిర్యాణి	8,863	9,281	4	18,148
వాంకిడి	14,458	14,134	3	28,595

వేతనాల సమస్య పరిష్కరించిన ఎమ్మెల్సీ


కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాల సమస్య పరిష్కారానికి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ చొరవ చూపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ శనివారం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని కాంట్రాక్టు కార్మికులతో చర్చలు జరిపారు. వీరి డిమాండ్లను పరిష్కరించే దిశగా అక్కడి నుంచే నేరుగా కుమరం భీం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడారు. జీతాల సమస్య పరిష్కరించేలా చూడాలని, పెండింగ్ సమస్యపై కూలంకషంగా మంత్రికి వివరించారు. అలాగే జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు రెండు నెలల జీతాలు తక్షణమే చెల్లించేలా చూడాలని కోరారు. అలాగే పెండింగ్ ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలపై కూడా త్వరలోనే పరిష్కరించేందుకు పక్కాగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు అధైర్యపడాల్సిన అవసరం లేదని అన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు తాము సమ్మెను విరమిస్తున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్సీ చొరవతో తమ సమస్య పరిష్కారమైందని కాంట్రాక్టు కార్మికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. చర్చల్లో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్‌తో పాటు స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులకు నేరాలను నియంత్రించేందుకు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉంటేనే బాధితులకు త్వరగా న్యాయం జరిగే అవకాశం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజా, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి జిల్లా పోలీసు అధికారులకు పలు చట్టాలకు సంబంధించిన అంశాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాక్షదారుల సేకరణలో జాగ్రత్తలు, దర్యాప్తు పద్ధతులు, ఎఫ్ఐఆర్ నమోదు విధానం, మైనర్ కేసులలో చైల్డ్ ప్రొటెక్షన్ చట్టాలు, మహిళలపై జరిగే నేరాల పరిధిలో అమలు చేయాల్సిన ప్రత్యేక నిబంధనలను వివరించారు. నేరం జరిగిన సమయంలో చట్ట పరమైన విధానాలను కచ్చితంగా పాటించడం ద్వారా కేసులు కోర్టులో బలపడతాయని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు అవగాహన సమావేశాలను సద్వినియోగం చేసుకొని తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి, ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పది లీటర్ల నాటు సారా పట్టివేత

చింతలమానేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం లంబాడీహెట్టి, రన్‌వెల్లి గ్రామాల్లో దాడులు నిర్వహించి పది లీటర్ల నాటు సారా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. గ్రామాల్లో శనివారం దాడులు నిర్వహించి నాటు సారా తయారీకి వాడే 300 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి, 20 కిలోల బెల్లం స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. నాటు సారా రవాణా చేస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా పది లీటర్లు పట్టుబడిందని చెప్పారు. ఈ మేరకు లంబాడీహెట్టి గ్రామానికి చెందిన బానోత్ ధన్‌రాజ్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

అర్ధరాత్రి యూరియా పంపిణీ

సిర్పూర్(టి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన ఫెర్టిలైజర్ డీలర్ శ్రీనివాస్ యూరియా లారీ తెప్పించి శుక్రవారం అర్ధరాత్రి విక్రయిస్తుండడంతో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ యూరియా లారీని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. డీలర్ వద్ద యూరియాకు సంబంధించి అన్ని ధ్రువపత్రాలు ఉండగా అర్ధరాత్రి పంపిణీ చేయడంతో అనుమానంతో ఏడీఏ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఏవో గిరీష్ భూపాలపట్నం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం డీఎస్పీ కార్యాలయానికి తరలించిన యూరియా లారీని తిరిగి గ్రామానికి తరలిలంచారు. యూరియా బస్తాలను ఓ గదిలో వేసి సీజ్ చేశారు.

డంపింగ్‌యార్డు తరలించాలి

మున్నూరుకాపు సంఘం నాయకుల వినతి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల పక్కనే ఉన్న డంపింగ్ యార్డును వేరే చోటిక తరలించాలని శనివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని చెత్త, జంతు కళేబరా లును ఆదర్శ పాఠశాల ప్రహరి గోడ పక్కనే పడవేయడంతో విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. అలాగే పక్కనే మైసమ్మ ఆలయానికి వెళ్లే దారిలో చెత్త వేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులు చొరవ తీసుకుని డంపింగ్ యార్డుకు వేరే చోటికి తరలించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గణపతి, జక్కయ్య, తిరుపతి, సురేష్, సదాశివ్, రాజేంద్రప్రసాద్, శంకర్, వెంకన్న, వినోద్, శ్రీను, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

వాంకిడి/పెంచికలపేట/బెజ్జూరు/దహెగాం/కెరమెరి/రెబ్బెన/సిరూర్(యు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు రకరకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. పెంచికలపేట మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సంప్రదాయ నృత్యాలు చేశారు. బెజ్జూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. దహెగాం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులతో కలసి ఉపాధ్యాయురాళ్లు ఆడిపాడారు. కెరమెరితో నిర్వహించిన బతుక మ్మ వేడుకల్లో ఎంఈవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. సిర్పూర్(యు) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహిచారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో కుడ్మేత సుధాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు. రెబ్బెన జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయరాణి తదితరులు పాల్గొన్నారు.


వాంకిడిలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు

ఉప్పొంగిన ఒర్రె


డోర్లి ఒర్రె ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి తిర్యాణి మండల కేంద్రానికి వెళ్లే దారిలో డోర్లి గ్రామం వద్ద ఉన్న ఒర్రె శనివారం చిన్నపాటి వర్షానికే ఉప్పొంగి ప్రవహించడంతో దాదాపు గంట పాటు ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. జిల్లా కేంద్రం నుంచి వెళ్లే ప్రధాన రహదారి కావడం వర్షాకాలంలో ప్రజ లకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై హైలెవల్ వంతెన నిర్మిస్తే ప్రజల కష్టాలు తీరే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమ్యలు పరిష్కరించాలని కోరుతూ పీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆనంద్, మహేష్, నిఖిల్, సాయిచరణ్, అంజి, ఉమేష్, ఉదయ్, చరణ్, ఉమామహేష్, సంజీవ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నటరాజ్, ఉపాధ్యా యులు సంతోష్, శ్రీనివాస్, వెంకట్రావు, నాగరాజు, శైలజ, శోభరాణి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్, (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో సోమవారం నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి బాల బాలికల షూటింగ్ బాల్ పోటీలకు ఆసిఫాబాద్ పట్టణంలోని ఆశ్రమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కర్ను, పీడీ హీరాబాయిలు తెలిపారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ పెంపునకు శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బెజ్జూరు, బారెగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, పురుషోత్తం, చంద్రయ్య, లచ్చయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మైదానంలో శనివారం జిల్లా స్థాయి నెట్‌బాల్ జూనియర్, సీనియర్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. నెట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు అలీబీన్ అహ్మద్ ప్రిన్సిపాల్ మహేశ్వరి, జిల్లా సెక్రెటరీ తిరుపతి, పీడీలు హరికృష్ణ, ఏడుకొండలు, రాకేష్, కిరణ్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాల విద్యార్థులను పాఠశాలకు చెందిన ఎలకరి శ్రీజ, కడతల స్రవంతి, చౌదరి కళ్యాణి, పోర్సెట్టి స్నేహితలు ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్‌కు జాతీయ స్థాయికి వరంగల్‌లో నిర్వహించే లీగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఎస్‌వో శ్రీజ నందిని, పీడీ పార్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కళా ఉత్సవం నృత్య ప్రదర్శనలో ద్వితీయ బహుమతి, ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ స్టేట్ లెవల్‌లో మొదటి బహుమతి సాధించిన విద్యార్థిని ఎస్ తేజశ్విని, మూడో బహుమతి సాధించిన జెహిమబిందు, కె అశ్విత సాధించారు. శనివారం ఎస్‌వో జ్యోతితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): కోయపల్లి గ్రామానికి చెందిన గ్రామస్థులు శనివారం రోడ్డుకు శ్రమదానం చేసి మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా దెబ్బతిని పోవడంతో రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో శ్రమదానం చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసిన గ్రామస్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పోశం, పొట్టి, యాదవ్, బన్నీ, వసంత్, తిరుపతి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి గ్రామంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని మహిళలు శనివారం ఉదయం ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా కావడం లేదని అన్నారు. గ్రామస్థులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకొని ఎంపీడీవో కోట ప్రసాద్, రూరల్ సీఐ కుమార స్వామి సంఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. దీంతో ధర్నాను విరమించారు. అలాగే వంజీరి గ్రామానికి చెందిన మహిళలు ఎంపీ డీవోకు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మీడియాపై ఆంక్షల పోస్టర్ల తొలగింపు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలోకి మీడియాకు అనుమతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆంక్షలు విధిస్తూ ఆసుపత్రి గోడలపై వేసిన పోస్టర్లను శనివారం సాయంత్రం తొలగించారు. వారం క్రితం మీడియాపై అంక్షలు విధిస్తూ జిల్లా ఆసుపత్రి గోడలపై పోస్టర్లు వేయగా జర్నలిస్టు సంఘాలు, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడానికి నిర్ణయించాయి. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేయడానికి జర్నలిస్టు సంఘాలు నిర్ణయించాయి. దీంతో ఆసుపత్రి సిబ్బంది గోడలపై అంటించిన పోస్టర్లను తొలగించింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలోకి మీడియాకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు.

గుంతలను పూడ్చిన పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ఆర్డీవో కార్యాలం నుంచి తుంపల్లికి వెళ్లే రోడ్డుపై ఏర్పాడిన గుంతలను సీఐ బాలాజీ వరప్రసాద్ శనివారం పూడ్చి వేయించారు. గుంతలు పూడ్చి వేయాల ని గతంలో పలు పార్టీలు, సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు.